## క్లుప్తంగా

### 99 మందిపై కేసులు



నందిగామ: డివిజన్ పరిధిలో కోడిపందేల నిర్వహణకు సంబంధించి 43 కేసులు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఏసీపీ వి.వి.నాయుడు బుధవారం తెలిపారు. డివిజన్‌లో మొత్తం 99మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. 63 కోడిపుంజులు, పందేల్లో వినియోగించే 73 కత్తులతోపాటు పందెంరాయుళ్ల నుంచి రూ.28వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

### దుప్పట్ల పంపిణీ



శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని శివాపురం గ్రామంలో బుధవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ(ఖమ్మం)వారు పేదపిల్లలకు దుప్పట్లు, స్నాక్స్, ఫ్యాన్సీ కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీతిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ లగడపాటి మోహనరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తాయన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జాకబ్, ఎర్నెస్ట్ పాల్ అభినందనీయులని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు లగడపాటి జనార్దన్, హెచ్‌ఎం ఎస్.రాము, కార్యక్రమ నిర్వాహకులు దైద వినోద్ పాల్గొన్నారు.

### ఘనంగా నిత్య సహాయ మాత మహోత్సవాలు



జగన్నాధపురం(వీరులపాడు): శాంతియుత సమాజమే ప్రభువు ఏసుక్రీస్తు సందేశమని జగన్నాథపురం నిత్య సహాయమాత ఆలయ ఫాదర్ సుగుణరావు పేర్కొన్నారు. నిత్య సహాయమాత ఆలయ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం దివ్యబలి పూజతోపాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణరావు మాట్లాడుతూ మనుషుల పాప విమోచనకే ప్రభువు ఏసుక్రీస్తు సిలువపై రక్తం చిందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు తోటివారి పట్ల ప్రేమ, దయతో మెలగాలని సూచించారు. అనంతరం మేరీమాత విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి బండి విజయ్ పాల్‌రెడ్డి, నాయకులు బాలస్వామి, నరసింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జ్ఞానారెడ్డి, నాయకులు, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధిపై శిక్షణా తరగతులు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం ఈవోపీఆర్డీ సాంబశివరావు మాట్లాడుతూ 17సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాతిపదికన ప్రణాళికలను తయారు చేసి అమలు చేసేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వ్యవసాయంతోపాటు కేంద్రం నుంచి వచ్చే నిధులను కూడా పంచాయతీ సమావేశాల్లో వివరించి అభివృద్ధి పనులపై చర్చించాలన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రాజు, సర్పంచులు, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, ఉద్యాన, వ్యవసాయశాఖ, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# శివాపురంలో అభివృద్ధి పరుగులు

- రూ.3.87 కోట్లతో అభివృద్ధి పనులు..
- తారురోడ్డు నిర్మాణానికి మరో రూ.కోటి
- మారిన పాఠశాల రూపురేఖలు
- మెరుగుపడిన మౌలిక వసతులు
- మంచినీటి సమస్యకు పరిష్కారం



శివాపురం గ్రామంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్లు

శివాపురం(పెనుగంచిప్రోలు): తెలంగాణ సరిహద్దు గ్రామంగా ఉన్న పెనుగంచిప్రోలు మండలంలోని శివాపురం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాల అభివృద్ధితోపాటు మంచినీటి పైపులైన్, సిమెంటు రోడ్లు ఇలా గ్రామంలో మౌలికవసతులు కల్పించడం ద్వారా మునుపెన్నడూ చూడని అభివృద్ధి సీఎం జగనన్న పాలనలో సాధ్యమైంది.

**రూ.45లక్షలతో సచివాలయం..**

గ్రామంలో రూ.45లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయం, రూ.21లక్షలతో తలపెట్టిన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) భవనాల నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి. కొద్దిరోజుల్లో ఈ భవనాలను ప్రారంభించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**పాఠశాలకు నూతన హంగులు..**

నాడు–నేడు పథకం కింద శివాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలను రూ.25లక్షలతో పనులు చేపట్టారు. దీంతో ప్రభుత్వ పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా విద్యార్థులకు మౌలికవసతులు కల్పించారు.మునుపెన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, సామినేని ఉదయభాను సహకారంతో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు సాగుతున్నాయి.

**రూ.2.59కోట్లతో ఇంటింటికీ కొళాయి..**

జలజీవన్ మిషన్ పథకంలో గ్రామంలో ఇంటింటికి కొళాయి సమకూరుస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే మునేరు వద్ద నుంచి రూ.2.59 కోట్లతో పైపులైన్ నిర్మాణ పనులు పూర్తిచేశారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సీఎండీఎఫ్ నిధులు రూ.29 లక్షలతో 60వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మాణం పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అదేవిధంగా రూ.8 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని 62మంది పేదలను గుర్తించి వారికి జగనన్న కాలనీలో స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేశారు. జగనన్న కాలనీలో 90శాతం మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకుని నివాసం ఉంటున్నారు. తమ సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శివాపురం నుంచి అనిగండ్లపాడు వరకు తారురోడ్డు నిర్మాణ పనులకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తయినందున త్వరలోనే పనులు ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.






నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



నిర్మాణం పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంక్



తుదిదశకు చేరిన సచివాలయ భవనం పనులు



రైతు భరోసా కేంద్రం

### ఊహించని అభివృద్ధి...



జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయిల నిధులతో గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణంతోపాటు మౌలిక వసతులు కల్పించాం. త్వరలోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తాం.

తాళ్లూరి నాగేశ్వరరావు,
ఉప సర్పంచి

### తాగునీటి సమస్యకు పరిష్కారం...



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక కృషితో జలజీవన్ మిషన్ కింద గ్రామంలో తాగునీటి పైపులైన్‌కు రూ.2.59 కోట్లు మంజూరయ్యాయి. పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు కూడా కొద్దిరోజుల్లో పూర్తవుతాయి. ఏళ్లనాటి మంచినీటి సమస్య పరిష్కారమైంది.

లగడపాటి నాగేశ్వరావు,
శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్

# చదువుతోనే సమాజాభివృద్ధి

**ఎమ్మెల్సీ అరుణకుమార్**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, సర్పంచి పున్నమ్మ

చందర్లపాడు(నందిగామ టౌన్): చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. కస్తాల మరియమ్మ స్మారక కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు మంగళవారం రాత్రి ఆయన బహుమతులు అందజేసి అభినందించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు చదువుకోవాలని చదువుతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయన్నారు. విద్య ప్రాధాన్యాన్ని గుర్తించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య తదితర పథకాలను అమలుచేస్తూ విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నారని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలోనే నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, తాను నడుచుకుంటున్నామని తెలిపారు. నిరుపేదల చదువుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పేదలకు అండగా ఉండి వారిలో విద్యాభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు. విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు, క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను సైతం నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు.

**ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు ఘనసత్కారం..**

స్మారక కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను టోర్నమెంట్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్తాల పున్నమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్‌ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, షేక్ కరిముల్లా, నాయకులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



పేటలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ స్వరాజ్ మైదానంలోని స్మృతివనంలో 206 అడుగుల ఎత్తుతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రపంచ చరిత్రలోనే చరిత్రాత్మకమని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వేల్పుల రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నియోజకవర్గ పార్టీ ఎస్సీసెల్ నాయకుడు, న్యాయవాది బూడిద నరసింహారావు పాల్గొని బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన జరిగే బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్నివర్గాలకు సామాజికన్యాయం అందిస్తున్నారన్నారు. పెనుగంచిప్రోలు మండల పార్టీ అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, పేట మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఇరుగు రవీంద్ర, పార్టీ ఎస్సీ సెల్ నేతలు ఏసుపోగు శ్రీనివాసరావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు(కేవీఆర్), పొద్దుటూరి రాజశేఖర్, మైల రామకృష్ణ, చెరుకుమల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**అందరూ తరలిరావాలి..**

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడలో శుక్రవారం జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అందరూ తరలిరావాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం వారు విలేకరులతో మాట్లాడుతూ సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు సీఎం జగనన్నతోనే సాధ్యమైందని పేర్కొన్నారు.

**పార్టీలకతీతంగా తరలిరావాలి...**

నందిగామ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పార్టీలకతీతంగా అందరూ తరలిరావాలని విశ్రాంత ఉద్యోగి పిల్లి జయరాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. విజయవాడలో రాష్ట్రం గర్వపడేలా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 19వతేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరుగుతుందని, పార్టీలకతీతంగా అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. నందిగామ నుంచి విజయవాడ తరలివెళ్లేందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు రవాణ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు వివరించారు.

# ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రభాకర్, వైద్యులు

జగ్గయ్యపేట అర్బన్: ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పేర్కొన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక పాత ఎన్‌ఎస్‌పీ క్వార్టర్స్‌లోని 14 వ సచివాలయం వద్ద 30, 31వ వార్డులకు సంబంధించి బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజల వద్దకే వెళ్లి నాణ్యమైన వైద్య సేవలను అందించే వినూత్నమైన కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వివరించారు. శిబిరంలో ప్రభుత్వాస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ హరీష్, గైనకాలజిస్ట్ అరుణ, జనరల్ వైద్యులు షైలా, కంటి వైద్యులు శ్రీనివాస్ పాల్గొని 442 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారని మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు తెలిపారు. కౌన్సిలర్లు పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రామయ్య, వార్డు సచివాలయం కన్వీనర్ గింజుపల్లి కృష్ణ, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్న మాలశామ్యూల్, వలంటీర్లు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సౌమ్యపై పోలీసులకు ఫిర్యాదు



సీఐ హనీష్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌లపై మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఇష్టారీతిన అసత్య ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అవమానించేలా మాట్లాడుతూ వారి కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్న మాజీఎమ్మెల్యే సౌమ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌హెచ్‌వో హనీష్‌కు వారు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సౌమ్య తాను ఏర్పాటు చేసే విలేకరుల సమావేశాల్లో, సామాజిక మాధ్యమాల ద్వారా సీఎంతోపాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అగౌరవపరిచేలా మాట్లాడుతుండటం తగదని మండిపడ్డారు. పోలీసులు తక్షణమే స్పందించి మాజీ ఎమ్మెల్యే సౌమ్యతోపాటు సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్న ఆమె అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది అద్దంకి మణిబాబు, కౌన్సిల్ సభ్యుడు షేక్ యాకుబ్ అలీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వైద్యపరీక్షలు క్రమం తప్పకూడదు



వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్యకేంద్రం సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడంతోపాటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని గులామొహుద్దీన్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ జమీల్ సూచించారు. స్థానిక చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఆరోగ్య అవగాహన, వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు. గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని అన్నారు. ఆశ, ఆరోగ్యకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అలాగే నూతనంగా జారీ చేసిన ఆరోగ్య శ్రీ కార్డులు, కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా పలువురికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం కమ్యూనిటీ ఆర్గనైజర్ దాసరి ప్రశాంత్‌కుమార్, ఏఎన్‌ఎం డి. ప్రసన్న ఆరోగ్యకేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

## రేపు బస్టాండ్ నుంచి పీడబ్ల్యూడీ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈనెల 19న పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పీడబ్ల్యూడీ గ్రౌండ్స్ వరకు ఏపీ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రవి, కె. ఎర్రాశాస్త్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బందర్ రోడ్డులో 19 ఎకరాల సువిశాల స్థలంలో రూ.400 కోట్లతో అంబేడ్కర్ పేరిట స్మృతి వనం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ జీవిత విశేషాలతో కూడిన మ్యూజియం, కన్వెన్షన్ సెంటర్ థియేటర్‌ను ఏర్పాటుచేసి నేటి తరానికి ఆయన గురించి తెలియజేసే ప్రయత్నం శుభసూచకమన్నారు. విగ్రహావిష్కరణకు రాష్ట్రం నలుమూలల నుంచి తమ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున రానున్నారని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా నిర్వహిస్తున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

### ఏసీబీ అధికారుల విచారణ

వత్సవాయి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ నెల 12న ఆళ్లూరుపాడులోని ఇనాం భూములకు పట్టాలు ఇచ్చేందుకు రూ.50వేలు లంచం తీసుకుంటున్న సంఘటనలో గ్రామ సర్పంచితోపాటు తహశీల్దార్‌ను అదుపులోకి తీసుకున్న విషయం పాఠకులకు విదితమే. దర్యాప్తులో భాగంగా ఏసీబీ అధికారులు బుధవారం ఆళ్లూరుపాడు గ్రామానికి చెందిన ఇనాం భూములకు పట్టాలు అందుకున్న కొంతమంది రైతులను కార్యాలయానికి పిలిపించి ఏసీబీ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు.

### బొడ్రాయి పునః ప్రతిష్ఠించాలి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అద్దాలబజారు శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం వద్ద 100ఏళ్ల కిందట ప్రతిష్ఠించిన చిన బొడ్రాయి ఆనవాళ్లు కనిపించకుండా సిమెంట్ రోడ్డు కింద కూరుకుపోయి ఉన్నందున తిరిగి పునఃప్రతిష్ఠించేందుకు పట్టణ ప్రముఖులు, ప్రజలు చొరవ చూపాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ ప్రజల శాంతి సౌభాగ్యాల కోసం బొడ్రాయిని శుభసూచికంగా భావిస్తున్నందున పునఃప్రతిష్ఠకు పట్టణ ప్రముఖులు, వ్యాపారులు, ఔత్సాహికులు కలసి ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయపార్టీలకతీతంగా పెద్దలంతా ముందుకు వచ్చి బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన చేయాలని ఆయన కోరారు.

### కిక్కిరిసిన జాతీయ రహదారి

కంచికచర్ల(వీరులపాడు): మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బుధవారం బారులు తీరాయి. స్వగ్రామంలో సంక్రాంతి పండుగను జరుపుకుని తిరిగి వెళ్తున్న వారి వాహనాలతో హైవే కిక్కిరిసిపోయింది. పెద్దసంఖ్యలో వాహనాలు వెళ్తుండటంతో రహదారుల వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. భవానీపురానికి చెందిన డి.శోభన్‌బాబు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి సత్కరించారు.